సాక్షి ప్రకాశం

మంగళవారం | 31 | జనవరి | 2023



రష్యా టూ నల్లమల

రష్యా నుంచి విదేశీ పక్షులు నల్లమల ప్రాంతానికి వచ్చాయి. 8 వేల కి.మీ ప్రయాణించి వచ్చిన ఈ పక్షులు నల్లమలలో సందడి చేస్తున్నాయి. - 8లో..



హోంగార్డు ఉద్యోగం పేరుతో టోకరా

తన కుమారుడికి హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి రూ.3 లక్షలు తీసుకున్నాడంటూ ఎస్పీకి మహిళ ఫిర్యాదు చేసింది. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29 /22

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

సమగ్రశిక్షలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్ జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.విజయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్-1, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్-1, జీసీడీవో-1, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్-1, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్-1, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్-1 పోస్టులకు ఫిబ్రవరి 4వతేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకటికంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేయదలచినవారు విడివిడిగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు, దరఖాస్తు నమూనాను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవోప్రకాశం.కో.ఇన్ అనే వెబ్‌సైట్లో ఉంచారని, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.విజయభాస్కర్ తెలిపారు.

ఫిబ్రవరి 4 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

ఒంగోలు: నేతాజీ జయంతిని పురస్కరించుకుని ఫిబ్రవరి 4, 5, 6 తేదీల్లో స్థానిక మినీ స్టేడియంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం సంబంధిత క్రీడాపోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ నాయకుల జయంతి సందర్భంగా 2014 నుంచి యువమోర్చా ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 4వ తేదీ సీనియర్ కేటగిరీ పురుషులు (85 కేజీల లోపు), 5వ తేదీ ఓపెన్ కేటగిరీ బాలికలకు ఉంటాయన్నారు. సీనియర్ కేటగిరీ పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు ఉంటాయన్నారు. 6వ తేదీ బాలురు (70 కేజీల లోపు, 20 సంవత్సరాలలోపు వయస్సు గలవారు) కి కూడా పోటీలు నిర్వహిస్తామని, వీరికి కూడా ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9542128169 ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌వర్మ, కార్యదర్శి తలపుల నాయక్, ఉపాధ్యక్షుడు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు ఎమ్మెల్యే అన్నా పరామర్శ



సబ్‌కలెక్టర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: పొదిలి సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్ ప్రయాణిస్తున్న కారును టిప్పర్ ఢీ కొట్టడంతో ఆయన గాయపడిన విషయం విదితమే. సబ్ కలెక్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు కందుకూరులో సోమవారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సేతు మాధవన్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ ఉత్తర్వులపై హర్షం

ఒంగోలు: రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు సర్వీస్‌ను ఒకరోజు బ్రేక్‌తో మరో రెండు నెలలు పొడిగిస్తూ జీవో ఆర్‌టీ నంబర్ 12 జారీ చేయడం పట్ల ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 31తో రెన్యువల్ ఉత్తర్వులు ముగుస్తున్న నేపథ్యంలో ఈ ఉత్తర్వులను ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జారీచేశారు. ఇంటర్మీడియెట్ విద్యాకమిషనర్ ఎంవీ శేషగిరిబాబు ప్రొసీడింగ్స్‌ను ఇంటర్ ఆర్‌జేడీలకు జీవో, ప్రొసీడింగ్స్‌ను సోమవారమే విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరికుంట సురేష్‌బాబు, వై.జాన్‌బాబు, సూకరి కృష్ణయ్య, పి.మాధవరావు, టీసీహెచ్ రంగయ్య, బీవీ కాశీరత్నం, ఎస్‌కే ఖాదర్‌వలి పేర్కొన్నారు.

మత్స్య సంపద
తాజా.. తాజాగా

మత్స్య ఉత్పత్తుల వినియోగాన్ని పెంచి ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఒక వైపు తాజా.. తాజా కూరగాయలు, చికెన్ మాదిరిగా అన్ని వేళల్లో అన్ని రకాల మత్స్య ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానుంది. మరో వైపు నిరుద్యోగ యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతోంది. జిల్లాలో మూడు 'ఫిష్ ఆంధ్రా' హబ్‌లు, లైవ్ ఫిష్ సూపర్ యూనిట్లు, కియోస్క్ యూనిట్లు, 150 మినీ రిటైల్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేసేందుకు మత్స్యశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఔత్సాహికులను ఎంపిక చేసే కసరత్తు ప్రారంభించారు.



ఫిష్ ఆంధ్ర కియోస్క్ నమూనా

- ఆక్వా హబ్ కింద జిల్లాలో యూనిట్ల ఏర్పాటు
- యువత, మహిళలకు ఉపాధి దిశగా చర్యలు
- రూ.50 లక్షలతో డైనింగ్ సౌకర్యంతో లాంజ్
- రూ.20 లక్షలతో లైవ్ ఫిష్ సూపర్ యూనిట్
- రూ.10 లక్షలతో కియోస్క్ యూనిట్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: చేపలు, రొయ్యలు, పీతలు ఇలా మత్స్య సంపదను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సముద్రంలో లభ్యమయ్యే మత్స్య ఉత్పత్తులతో పాటు సాధారణంగా మంచినీటిలో లభ్యమయ్యే మత్స్య సంపదను కూడా ఎవరి అభిరుచులకు తగ్గట్లు వారికి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ విధానానికి రూపకల్పన చేశారు. ప్రభుత్వం ప్రతి యూనిట్‌కు సబ్సిడీ ఇచ్చి మరీ ప్రోత్సహిస్తోంది. బ్యాంకు రుణ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. ప్రధానంగా ఈ రంగంలోని వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. మత్స్యకారులకు, సముద్రాన్ని నమ్ముకుని జీవించేవారి శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కేలా చర్యలు చేపట్టారు.



ఫిష్ ఆంధ్ర నమూనా

జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా మత్స్య సంపద, మత్స్య ఉత్పత్తులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగానికి ఇస్తున్న చేయూతతో పాటు మత్స్యకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాల వలన జిల్లాలో చేపలు, రొయ్యలు, పీతల ఉత్పత్తి అధికంగా ఉంది. తద్వారా జిల్లా నుంచి చేపలను ఇతర రాష్ట్రాలకు, రొయ్యలు, పీతలను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఏదైనా కారణాలతో ఎగుమతులు తగ్గినప్పుడు అటు రొయ్యల రైతులు, ఇటు మత్స్యకారులు నష్టపోతున్నారు. అలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు వారి నష్టాలను నివారించడానికి, స్థానికంగా ప్రజలకు తాజా..తాజా మత్స్య సంపదను అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం ఆక్వా హబ్‌లు ఏర్పాటు చేస్తోంది.

కియోస్క్ యూనిట్లు:

జిల్లాలో కియోస్క్ యూనిట్లు 42 నెలకొల్పాలని జిల్లా అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఒక్కో యూనిట్ విలువ రూ.10 లక్షలు. యూనిట్ స్థాపనకు రూ.2 లక్షలు లబ్ధిదారుని వాటాగా ఉంటుంది. మిగతా మొత్తం బ్యాంకు రుణంగా తీసుకోవాలి. అందులో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 60 శాతం, బీసీ, ఓసీ లబ్ధిదారులకు 40 శాతం సబ్సిడీ అందిస్తారు.

వాల్యూయాడెడ్ యూనిట్లు:

జిల్లాలో వాల్యూయాడెడ్ యూనిట్లు రెండు నెలకొల్పాలని నిర్ణయించారు. ఒక్కో యూనిట్ ధర రూ.50 లక్షలుగా ఉంది. లబ్ధిదారుని వాటా రూ.10 లక్షల వరకు ఉంటుంది. ఈ యూనిట్‌ను జాతీయ రహదారులపై ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

జిల్లాలో 15 వేల ఎకరాలకుపైగా ఆక్వా సాగులో ఉంది. ఉప్పునీరు, మంచినీటిలో రొయ్యల పెంపకం కూడా సాగుతోంది. అదేవిధంగా జిల్లాలోని సాగునీటి చెరువుల్లో కూడా చేపలు, రొయ్యల పెంపకాన్ని చేపడుతున్నారు. జిల్లాలో తీర ప్రాంత మండలాలు నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సింగరాయకొండ ఉన్నాయి. తీర ప్రాంతం 52 కిలోమీటర్ల మేర ఉంది. మత్స్యకార గ్రామాలు 35 ఉండగా ఆయా గ్రామాల్లో దాదాపు మత్స్యకార కుటుంబాలు 10 వేలకుపైగా ఉన్నాయి.

నాణ్యమైన మత్స్య సంపద..



ఫిష్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు ఫిబ్రవరి ఆఖరులోపు అన్ని యూనిట్లు స్థాపించాల్సి ఉంది. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ ఊపందుకుంది. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న మత్స్య సంపదను డొమెస్టిక్‌గా వాడుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన మత్స్య సంపదను వినియోగదారులకు అందుబాటులోకి తేనుంది. అదేవిధంగా నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఆవుల చంద్రశేఖరరెడ్డి, జేడీ, జిల్లా మత్స్యశాఖ

ఫిష్ ఆంధ్ర పథకాన్ని విజయవంతం చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫిష్ ఆంధ్ర పథకాన్ని విజయవంతం చేయాలి. ఒంగోలు నగర ప్రజలకు నాణ్యమైన చేపలు, రొయ్యలు, పీతలులాంటి మత్స్య ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేసేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుంది. ఒంగోలు నగరంలో సుమారు 50 ఫిష్ ఆంధ్ర మినీ రిటైల్ విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. – ఎం.వెంకటేశ్వరరావు, కమిషనర్, ఒంగోలు నగర పాలకసంస్థ

ఆక్వా హబ్‌లు...

జిల్లాలో మూడు ఆక్వా హబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. జిల్లా కేంద్రం ఒంగోలుతో పాటు మార్కాపురం, కనిగిరిలో ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు. అందుకోసం 1.50 ఎకరాల్లో నెలకొల్పే విధంగా ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నారు. ఒక్కో ఆక్వా హబ్‌ను రూ.కోటితో నెలకొల్పేలా ప్రణాళికలు రూపొందించారు. అందులో ఐస్ ప్లాంటు, కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం, షెడ్, లైవ్లీ ఫిష్ ట్యాంకు పెద్దది, వాటర్ కనెక్షన్లతో పాటు ఇతర సదుపాయాలు కూడా ఏర్పాటు చేసుకోవాలి. ఈ హబ్ నుంచి 100 లైవ్ ఫిష్ వెండింగ్ యూనిట్లకు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మినీ రిటైల్ అవుట్‌లెట్లు

జిల్లా వ్యాప్తంగా 152 మినీ రిటైల్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం ఎంపిక ప్రక్రియ కూడా ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష పెట్టుబడితో ఉపాధి పొందవచ్చు. అదే మండల కేంద్రం, చిన్న మున్సిపాలిటీలో అయితే రూ.2 లక్షలు, కార్పొరేషన్లలో అయితే రూ.3 లక్షలతో ప్రారంభించవచ్చు.

లైవ్ ఫిష్ వెండింగ్ యూనిట్లు

జిల్లాలో లైవ్ ఫిష్ వెండింగ్ యూనిట్లు 10 నెలకొల్పనున్నారు. ఒక్కో యూనిట్ ధర రూ.20 లక్షలు ఉంటుంది. ఇందులో లబ్ధిదారుని వాటా రూ.4 లక్షలు కాగా, మిగతాది బ్యాంకు రుణంగా తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సబ్సిడీలు వర్తిస్తాయి.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రతి గడపకు సంక్షేమ పథకాలు
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి
- 31వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



31వ డివిజన్ వడ్డెపాలెంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే, బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు. ఒంగోలు నగరంలో సోమవారం 31వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయనగర్ కాలనీ, వడ్డెర పాలెం నాలుగో లైన్ నుంచి ప్రారంభించారు. ఐదు, ఆరు, ఏడు లైన్లలో బాలినేని గడప గడపకు తిరిగి స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా బాలినేని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన 3648 కిలో మీటర్ల ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకొని, కళ్లారా చూసినందువల్లే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగుతోందన్నారు. బాధల్లో ఉండే వారిని అక్కున చేర్చుకుంటున్న సీఎం వైఎస్ జగన్ ప్రతి ఒక్కరి మదిలోనూ గుర్తుండిపోతున్నాడన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆకాంక్ష అన్నారు. ఒంగోలు నగరంలోని ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. 31వ డివిజన్‌లో ఇప్పటి వరకు రూ.77.90 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని చెప్పారు. మరో రూ.65.30 లక్షలతో సిమెంట్ రోడ్లు, సీసీ డ్రైయిన్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. ఈ సందర్భంగా డివిజన్లోని స్థానికులు మరికొన్ని సమస్యలను బాలినేని దృష్టికి తీసుకొచ్చారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన తీరును బాలినేని స్వయంగా అడిగి తెలుసుకుంటున్నారు. సంక్షేమ పథకాలు వస్తున్న తీరును అడిగి, ఇంకేమైనా సలహాలు ఉంటే ఇవ్వాలని ప్రజలను బాలినేని కోరుతున్నారు. కార్యక్రమంలో వ్యక్తిగత సమస్యలను కూడా బాలినేని దృష్టికి తీసుకొస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, ఏపీఐఐసీ కార్పొరేషన్ సభ్యులు ముప్పా స్వాతి, కార్పొరేటర్లు ఈదర చిన్నారి, జడా వెంకట్, తాడి కృష్ణలత, చింతపల్లి గోపీచంద్, ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బొప్పరాజు జ్యోతి, గొర్రెపాటి శ్రీనివాసులు, పసుపులేటి శ్రీనివాసులు, విస్సు, ఆర్.హైమావతి, మోదుబోయిన సురేష్, తమ్మినేని మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, బైరెడ్డి అరుణ, బేదపూడి రాజేశ్వరి, దేవరపల్లి అంజిరెడ్డి, బొట్ల సుబ్బారావు, జాజుల కృష్ణ, పుచ్చకాయల గోవర్ధన రెడ్డి, జే.పున్నయ్య, సోమశేఖర్, 31వ డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు జి.స్వరూప్, మిడసల మధు బాబు, గుంజి ఏడుకొండలు, బండారు శ్రీరాములు, కొమ్ము రవి, బండారు మల్లిఖార్జునరావు, విసు, బడుగు ఇందిర, కొమ్మూరి రవిచంద్ర, కొమ్ము రాజీవ్, దాసు, విజయ, కుమారు, కట్టా రాజు, రమాకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- చేతివృత్తుల వారికి ప్రభుత్వం చేదోడు
- జగనన్న చేదోడు మూడో విడత కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్, నగర మేయర్

ఒంగోలు అర్బన్: సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందేలా చేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటోందన్నారు. సోమవారం జగనన్న చేదోడు పథకం మూడో విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించారు. దీనికి అనుబంధంగా స్థానిక ప్రకాశం భవనంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాలినేనితో పాటు కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొన్నారు. తొలుత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలినేని మాట్లాడుతూ రాష్ట్రంలో ఎటువంటి వివక్ష లేకుండా అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. చేతి వృత్తి చేసుకునే వారికి అవసరమైన పరికరాలే కాకుండా మరింత అండగా ఉండేలా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తున్నారన్నారు. బీసీ కులాలకు నగరంలో ఆరామ క్షేత్రాలు కూడా నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని చేతివృత్తిదారులు సద్వినియోగం చేసుకుని మరింత ఆర్థికంగా ఎదగాలని కోరారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న చేదోడు పథకం కింద 14,527 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.14.52 కోట్లు ప్రయోజనం కలిగిందన్నారు. వారిలో నాయీ బ్రాహ్మణులు 1,771, రజకులు 2,949, దర్జీలు 9,807 ఉన్నట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్ ఉషారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్

సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి

- ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- స్పందనలో కలెక్టర్ దినేష్‌కుమార్



అర్జీదారులు సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చిన అర్జీల తాలూకు సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. స్పందన భవనంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తే సమస్య తిరిగి పునరావృతం కాకుండా ఉంటుందన్నారు. ప్రభుత్వ సేవలన్నీ సచివాలయాల ద్వారా జరిగేలా చూడాలన్నారు. ముఖ హాజరు ప్రతి ఉద్యోగి వినియోగించాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్‌ఓ ఓబులేసు, ప్రత్యేక కలెక్టర్ గ్లోరియా, ఇతర అధికారులు పాల్గొన్నారు. స్పందన కార్యక్రమంలో ఇరువురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలి



లెప్రసీ అవగాహన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: కుష్టు వ్యాధిపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వివరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ప్రకాశం భవనంలో స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమంపై జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వంలోని ప్రధాన శాఖల అధికారులు, ఉద్యోగులు కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకు పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. దీనిలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, క్షయ నివారణ అధికారి సురేష్‌కుమార్, డీఈఓ విజయభాస్కర్, డీపీఓ నారాయణ రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పర్శ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

క్లుప్తంగా

16 ఏళ్ల బాలుడు ఆత్మహత్య


యశ్వంత్(ఫైల్)

ఒంగోలు టౌన్: నగరంలో మరో బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం ప్రకారం.. బాలాజీ నగర్‌కు చెందిన కర్రి సుబ్బారావు, కృష్ణకుమారి దంపతులకు ఇద్దరు సంతానం. భార్యాభర్తలు ఇద్దరిలో ఒకరు చికెన్ స్టాల్ నిర్వహిస్తుండగా మరొకరు అక్కడే టిఫిన్ బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఆ దంపతుల పెద్ద కుమారుడైన వెంకట యశ్వంత్ కుమార్(16) పదో తరగతి చదువుతున్నాడు. చదువు మానేసి ఇటీవల కేటరింగ్ పనికి వెళ్తున్నాడు. గత కొద్ది రోజులుగా కడుపులో నొప్పిగా ఉందని ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో యశ్వంత్ ఫ్యానుకు ఉరి వేసుకుని మరణించాడు. సుబ్బారావు ఫిర్యాదు మేరకు తాలుకా ఎస్సై షేక్ మీరా సాహెబ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి బాలుడు మృతి




మార్కాపురం: రైలుకింద పడి బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. మార్కాపురం-తర్లుపాడు మార్గంలో ఔట్ సిగ్నల్ వద్ద సోమవారం ఉదయం సుమారు 17 సంవత్సరాల బాలుడి మృతదేహం పడి ఉంది. మార్కాపురం పట్టణానికి చెందిన ఆకుల బాలాజీ కుమారుడు శివగా గుర్తించినట్లు హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ తెలిపారు. పొరపాటున పడ్డాడా? ఆత్మహత్యకు ప్రయత్నించాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జలీల్‌ఖాన్ తెలిపారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం చేస్తుంటాడు.


రష్యా టూ నల్లమల

8 వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చిన విదేశీ పక్షులు

మార్కాపురం: రష్యా నుంచి విదేశీ పక్షులు నల్లమల ప్రాంతానికి వచ్చాయి. రష్యా, మధ్య ఆసియా, ఉజ్బెకిస్తాన్, కజికిస్తాన్ దేశాల నుంచి సుమారు 8 వేల కిలోమీటర్లు ప్రయాణించిన ఈ పక్షులు ప్రస్తుతం నల్లమలలో తిరుగుతున్నాయి. పెద్దదోర్నాల, రోళ్లపెంట ప్రాంతాల్లో వీటిని బయోడైవర్శిటీ శ్రీశైలం ఎఫ్ఆర్‌వో హాయత్ ఫొటోలు తీశారు. ప్రతి ఏడాది డిసెంబర్ మొదటి వారంలో పక్షులు ఈ ప్రాంతానికి వచ్చి ఫిబ్రవరి నెలలో మళ్లీ సొంత గూటికి చేరతాయన్నారు. అరుదైన ఈ పక్షులు నల్లమలకే అందాలనిస్తున్నాయని చెప్పారు. మన దేశంలో నల్లమలలోని శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్టులోనే ఈ పక్షులు ఉన్నాయి. గడ్డి మైదానాలకు మాత్రమే ఈ పక్షులు వలస వస్తాయి. మిడతలు, చిన్నచిన్న పురుగులను తిని జీవిస్తాయి. ఈ సమయంలో మధ్య ఆసియాలో ఆహారం దొరకదు. దీంతో విడిది కోసం ఇక్కడికి వచ్చి ఆహారం తింటూ ఎండలు ప్రారంభం కాగానే వెళతాయి. డేగ జాతికి చెందిన ఈ పక్షులలో మాన్‌టెగ్యూస్ హారియర్, పాలిడ్ హారియర్, ఎరూషియన్ మార్ష్ హారియర్ ముఖ్యమైనవి. నెల రోజుల పాటు కష్టపడి వీటి జీవనశైలిని పరిశీలించి ప్రత్యేక కెమెరాలతో ఫొటోలు తీసినట్లు హాయత్ తెలిపారు.


ఎరూషియన్ మార్ష్ హారియర్


మాన్‌టెగ్యూస్ హారియర్


పాలిడ్ హారియర్

మృగాడికి మరణ దండన..

ఎస్పీకి అభినందన


ఎస్పీని అభినందిస్తున్న బాలిక కుటుంబ సభ్యులు

ఒంగోలు టౌన్: అల్లారుముద్దుగా పెంచుకున్న తమ ఏడేళ్ల కూతురిని దారుణంగా అత్యాచారం చేసి హతమార్చిన నిందితుడికి మరణ శిక్ష పడటంలో ఎస్పీ మలికా గర్గ్ చూపిన చొరవను తాము ఎన్నటికీ మరిచిపోలేమని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. గిద్దలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని అంబవరం గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికను దగ్గరి బంధువు ఒకరు అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో నిందితుడికి ఇటీవల న్యాయస్థానం ఉరి శిక్ష విధించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాలిక తలిదండ్రులు, బంధువులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమ బిడ్డ కేసులో పోలీసులు సత్వరమే స్పందించడం, పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టడం వల్లనే నిందితుడికి శిక్ష పడిందని తెలిపారు. తమకు న్యాయం జరిగేలా కృషి చేసిన జిల్లా పోలీసు శాఖను, ఎస్పీ మలికా గర్గ్‌ను జీవితాంతం గుర్తు పెట్టుకుంటామన్నారు. కాగా బాలిక కుటుంబం ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఆపద వచ్చినా పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ వారికి భరోసా ఇచ్చారు.

కర్నూలు ఘాట్ రోడ్డులో ప్రమాదం

- ఇద్దరు వ్యక్తులకు గాయాలు


ఎదురెదురుగా ఢీకొన్న వాహనాలు

పెద్దదోర్నాల: ఎదురెదురుగా వస్తున్న కారు, ట్రక్ ఢీకొన్న సంఘటన కర్నూలు రోడ్డులోని రోళ్లపెంట వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో కర్నూలుకు చెందిన రవిప్రకాశ్, జక్రయ్య తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై శ్రీనివాసరావు కథనం మేరకు.. కర్నూలు నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు, దోర్నాల వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ట్రక్ పరస్పరం ఢీకొన్నాయి. క్షతగాత్రులను 108 వాహనంలో దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ఏరియా వైద్యశాలకు సిఫార్సు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి

- చెల్లెమ్మగారి పట్టపుపాలెం వద్ద తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం


చెల్లెమ్మగారి పట్టపుపాలెం వద్ద అమాద్ మృతదేహం

సింగరాయకొండ: పాకల బీచ్ లో ఆదివారం సముద్ర స్నానం చేస్తూ రిప్ కరెంట్(సుడి గుండం) కారణంగా గల్లంతైన యువకుడు షేక్ అబ్దుల్ అమాద్(15) మృతి చెందాడు. బాలుడి మృతదేహం సోమవారం ఉదయం పాకల పంచాయతీ చెల్లెమ్మ గారి పట్టపుపాలెం వద్ద తీరానికి కొట్టుకువచ్చిందని ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. ఆదివారం అమాద్‌తోపాటు అతని చెల్లెలు అమల్ గల్లంతు కాగా మత్స్యకారులు వేగంగా స్పందించి అమల్‌ను రక్షించిన విషయం తెలిసిందే. అమాద్ ఆచూకీ కోసం మెరైన్ పోలీసులు, మత్స్యకారులు తీరం వెంబడి వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

హోంగార్డు ఉద్యోగం పేరుతో టోకరా

- స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళ
- పోలీసు స్పందనకు 84 ఫిర్యాదులు
- సత్వర న్యాయం చేయాలని అధికారులను ఆదేశించిన ఎస్పీ మలికా గర్గ్


స్పందనలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: తన కుమారుడికి హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికిన ఉలవపాడుకు చెందిన ఓ వ్యక్తి 3 లక్షల రుపాయలు వసూలు చేశాడని దోర్నాల మండలానికి చెందిన ఒక మహిళ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే కస్టమర్ కేర్ నుంచి కాల్ చేస్తున్నామంటూ ఫోన్ చేసిన ఓ అగంతకుడు తమ ఫ్లిప్‌కార్టు పే లెటర్ అకౌంట్ నుంచి రూ.45 వేలు కాజేశాడని కొండపికి చెందిన ఓ వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన స్పందనలో మొత్తం 84 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు నేరుగా ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు.

రాతపూర్వకంగా ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(క్రైమ్) ఎస్వీ శ్రీధరరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, దిశ డీఎస్పీ పల్లపురాజు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్ర, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం


మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత, పార్టీ నాయకులు


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

- ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: జాతిపిత మహాత్మ గాంధీ ప్రతి అడుగూ అనుసరణీయమేనని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ అభ్యున్నతిని కాంక్షించాలని నగర మేయర్ గంగాడ సుజాత పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మహాత్మ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా బాపూజీ చిత్రపటానికి, అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ.. మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాలను నెలకొల్పడంతోపాటు మహిళోద్ధరణకు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవులతోపాటు స్థానిక సంస్థల్లో సైతం 50 శాతం పదవులు ఇచ్చారన్నారు. దిశ యాప్‌ను తీసుకువచ్చి ఆడబిడ్డలను తోబుట్టువులుగా చూసుకుంటున్నారని ఇటువంటి ముఖ్యమంత్రి పదికాలాల పాటు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్‌రావు మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ ఆశయాల సాధనే లక్ష్యంగా అందరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురిణి ప్రభావతి, రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గంటా రామానాయుడు, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, మహిళా నాయకురాలు కావూరి సుశీల, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్, భట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రాజు, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ తిర్లిక శ్రీనివాసరావు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ధరణికోట లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మట్టి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ అడుగు జాడల్లో నడవాలి : జంకె

మార్కాపురం: మహాత్ముని అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని తన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు యాక్షన్ ప్లాన్

- కలెక్టర్ దినేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మాదకద్రావ్యాల నివారణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. 'మైనర్లలో మాదకద్రావ్యాలు, మత్తు పదార్ధాల వినియోగ నివారణ, అక్రమ సరఫరా కట్టడి'పై సోమవారం ప్రకాశం భవనంలో పలు శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మైనర్లకు మాదకద్రవ్యాలు అందకుండా నివారించేందుకు అవసరమైన చర్యలపై ప్రణాళిక రూపొందించాలన్నారు. 18 ఏళ్లు నిండని వారికి గంజాయి, మద్యం, పొగాకు తదితర మాదకద్రవ్యాలు అందకుండా నిఘా ఉంచాలన్నారు. పాఠశాలలు, కాలేజీల సమీపంలో బడ్డీ బంకులు, రిక్షా బండ్లపై నిఘా ఉంచి మాదకద్రవ్యాలు విక్రయించకుండా చూడాలన్నారు. మద్యం షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 21 ఏళ్లలోపు పిల్లలకు మద్యం విక్రయించకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు.

స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన పోస్టర్లు అతికించడంతోపాటు నోటీస్ బోర్డుల్లో కూడా వాటిని ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పి.దినేష్‌కుమార్, సీడబ్ల్యూసీ సభ్యురాలు వంశీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.